ఖాజీపల్లిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ఖాజీపల్లిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

జిన్నారం, మార్చి 30: ఖాజీపల్లి పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. గ్రామంలోని సర్వేనంబర్ 181 ప్రభుత్వ భూమిలో గ్రామానికి ఆనుకొని ఉన్న స్థలాల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ జేసీబీతో బేస్మెంట్లు, ఇండ్లను కూల్చివేశారు. కొన్ని రోజులుగా ఖాజీపల్లి పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు తరచూ కూల్చివేస్తున్నా అక్రమార్కులు ఆగడం లేదు. రాత్రికిరాత్రే నిర్మిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు సీరియస్ అవుతున్నారు. ఈసారి ఎవరైన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తారా కళాశాల పరీక్ష ఫీజు గడువు పెంపు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 30: కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. సెమిస్టర్-2,4,6 రెగ్యులర్ విద్యార్థులతోపాటు 2019-20 నుంచి 2023-24లో ఎన్రోలైన సెమిస్టర్-1,2,3,4,5,6 బ్యాక్‌లాగ్ విద్యార్థులు నిర్దేశించిన పరీక్ష ఫీజును ఏప్రిల్ 6లోగా ఎలాంటి అదనపు ఫీజు లేకుండా చెల్లించాలన్నారు. ఏప్రిల్ 15 వరకు రూ.500 అపరాధ రుసుముతో చెల్లించవచ్చన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి కళాశాల అడ్మిషన్ ఫీజు పూర్తిగా చెల్లించిన విద్యార్థులు మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు 75శాతం హాజరు విధిగా ఉండాలన్నారు. కళాశాల వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, నిర్దేశిత పరీక్ష ఫీజును అక్టోపాడ్ ద్వారా చెల్లించి రసీదు జత చేయాలన్నారు. అదేవిధంగా 40శాతం దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష ఫీజులో మినహాయింపు ఉన్నదన్నారు. అయితే వారు సదరం సర్టిఫికెట్‌ను జత చేయాలని సూచించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లిం పెద్దలకు పండ్లు తినిపిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోమిరెడ్డి

రామచంద్రాపురం, మార్చి 30: రంజాన్ పండుగను పురస్కరించుకొని నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లేపల్లి సోమిరెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ ఫేజ్-2లో ఉన్న మసీద్‌లో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో భెల్ సీనియర్ కార్మిక నాయకుడు ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేశ్, బాబ్జీ, బుచ్చిరెడ్డి, లచ్చిరాం, శ్రీశైలం, నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి, ఉమేశ్, అంజయ్య, కాలనీ అధ్యక్షుడు అజీమ్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

రాములు (ఫైల్)

చౌటకూర్, మార్చి 30: మండలంలోని శివంపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల వద్ద 161వ జాతీయ రహదారిపై శనివారం శివంపేట వద్ద రోడ్డు దాటుతుండగా ఒకరు, సుల్తాన్‌పూర్ వద్ద కారు బోల్తాపడిన ఘటనలో మరొకరు మృతి చెందారు. పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం...శివంపేట గ్రామానికి చెందిన మిరియాల రాములు (65) పొలానికి నీళ్లు పెట్టేందుకు రోడ్డు దాటుతుండా సంగారెడ్డి వైపు నుంచి వేగంగా వస్తున్న ఆర్‌జే02 జీసీ 4972 నంబరు గల కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాములు అక్కడికక్కడే మృతి చెందారు. సుల్తాన్‌పూర్ శివారులో ఇదే జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారం చేపట్టింది నిజం కాదా
- రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ
- బీఆర్ఎస్ హయాంలోనే నారాయణఖేడ్ అభివృద్ధి
- బీబీ పాటిల్‌కు డిపాజిట్ రానీయద్దు
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా
- జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్
- నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం విజయవంతం

మోసం చేసిన కాంగ్రెస్‌కు దిమ్మతిరగాలి

నారాయణఖేడ్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి30: ఆరు గ్యారంటీలు, 13 హామీలిచ్చి ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో దిమ్మదిరిగే విధంగా జవాబివ్వాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నారాయణఖేడ్‌లోని కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నారాయణఖేడ్ ప్రజలు మంచికి మంచి చెడ్డకు చెడ్డ అనే విధంగా ఉంటారని, మేలు చేసిన వారికి మేలు చేద్దాం కాని, మోసం చేసిన వారికి మాత్రం గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఉద్యమకారుడైన గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 114 రోజులైనా వంద రోజుల్లో తీరుస్తామన్న హామీలు నెరవేర్చలేదన్నారు.

బీబీ పాటిల్‌కు బుద్ధిచెప్పాలి...

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బీబీ పాటిల్‌కు ఏం తక్కువైందని, తల్లిలాంటి బీఆర్ఎస్‌ను వదిలి బీజేపీలోకి వెళ్లారని పోచారం శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్తల శ్రమ ఫలితంగా రెండుసార్లు ఎంపీగా గెలిచిన బీబీ పాటిల్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోవడమే కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏమాత్రం న్యాయం చేయలేదన్నారు. తన స్వార్థం కోసం, తన వ్యాపార ప్రయోజనాల కోసం, తన ఆస్తులను కాపాడుకోవడం కోసం బీజేపీలో చేరిన ఆయనకు డిపాజిట్ దక్కకుండా ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఎవరి మత విశ్వాసాలు వారివని, ఏపార్టీలో ఉన్నా హిందువులు రాముడినే పూజిస్తారని, కానీ.. బీజేపీ మాత్రం రాముడి పేరు మీద రాజకీయాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఎదిరించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేసే కుట్రలకు పూనుకుంటున్న బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో చెంప చెళ్లుమనిపించాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ జైపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు, కార్యకర్తలు

అండగా ఉంటా.. ఆశీర్వదించండి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 70 ఏండ్లుగా జరగని అభివృద్ధి కేవలం పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే స్థానికు సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ సత్తా చాటే అవకాశం ఉంటుందన్నారు. పదేండ్లు బీబీ పాటిల్‌కు బీఆర్ఎస్ ఎంపీగా అవకాశం కల్పిస్తే, ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని గాలి అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు.

వారు చేసిందేమీ లేదు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ శెట్కార్ నారాయణఖేడ్ ప్రాంతానికి చేసిందేమి లేదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. బీ బీ పాటిల్ రెండు సార్లు ఎంపీగా ఎన్నికైనా ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, మరోవైపు కార్యకర్తలను సైతం పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం తనతో కలిసి ఉద్యమించిన గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

100 శాతం ఓటు నమోదు స్వీప్ కార్యక్రమాలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 30: జిల్లాలో 100 శాతం ఓటు నమోదు స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 16న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఏప్రిల్ 18న నోటిఫికేషన్, 25న నామినేషన్స్ స్వీకరణకు చివరి తేదీ అని, 26న నామినేషన్ల స్క్రూట్నీ, 29 ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని వివరించారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ 24 బై7, మూడు షిఫ్టుల్లో ఎస్ఎస్‌టీ, వీఎస్టీ, వ్యయ బృందాలు పనిచేస్తాయన్నారు. నగదు రవాణా, అక్రమ మద్యం అరికట్టేందుకు ఆర్టీఏ, ఆదాయ పన్ను, ఎక్సైజ్, ఈడీ, జీఎస్టీ, కస్టమ్స్, నార్కోటిక్స్, పోలీసు అధికారులను ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్ద నియమించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలకు, నాయకుల సమావేశాలకు సింగిల్ విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని స్పష్టం చేశారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తునామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 30: ఎన్నికల విధులు, పోలింగ్ రోజున అత్యవసర సేవలు, విధులు నిర్వహించే ప్రతిఒక్కరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో వికాస్‌రాజ్ మాట్లాడుతూ పోలింగ్ సేవలు అందిస్తున్న వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కోసం అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద విధిగా ఓటర్ సౌకర్య కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది పేరు, ఎంప్లాయి కోడ్, హోదా, మొబైల్ నెంబర్, ఓటర్ వివరాలు, అసెంబ్లీ సెగ్మెంట్ వివరాలు, ఓటరు జాబితాలో పార్ట్ అండ్ సీరియల్ నెంబరు, ఓటరు గుర్తింపు కార్డు వివరాలు రూపొందించాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం రిటర్నింగ్ అధికారికి ఏప్రిల్ 23లోగా ఫారం 12డీ సమర్పించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి రిటర్నింగ్ అధికారి ఏప్రిల్ 24న ఆమోదించి, ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రానికి సమాచారం అందిస్తారన్నారు. మే 3 నుంచి 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద వారు ఓటుహక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

చేసిన పనులే గుర్తింపునిస్తాయి

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను శాలువా కప్పి సత్కరిస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, మార్చి 30: ప్రభుత్వ ఉద్యోగిగా విధుల్లో చేరినప్పటి నుంచి విరమణ పొందే వరకు బాధ్యతగా చేసిన పనులు గుర్తింపునిస్తాయని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు సుభాష్, సత్యనారాయణలను పూలమాలతో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖ నుంచి వారికి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేషజీవితం కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని భగవంతున్ని ఎస్పీ వేడుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్యాణి, సూపరింటెండెంట్లు అశోక్, వెంకటేశం, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

మాల మహానాడు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన అంజనేయులు

సంగారెడ్డి, మార్చి 30: రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు నీరడి అంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జాతీయ మాల మహానాడు రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే మాల మహానాడు రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్ర జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు ఇన్‌చార్జీ ఊరట్ల శివ, అధ్యక్షుడు కల్లూరి సంజీవ, మెదక్ జిల్లా యువ జన అధ్యక్షుడు నరేశ్, నర్సాపూర్ పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, మార్చి 30: వీరన్నగూడెంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఈవో శశిధర్‌గుప్తా, ప్రధానార్చకుడు శివనాగులు, పురోహితుడు కిరణ్‌కుమార్ శర్మ, అర్చక బృందం కలిసి మహా గణపతి పూజ, అఖండదీపారాధన, మత్స్యగ్రహణం, దేవతాహ్వాన, భేరిపూజ, ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. వీరభద్రస్వామి వార్లకు ఈవో పట్టువస్త్రాలను, పూలు, పండ్లు, ఆభరణాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణావిజయ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు, యువ నాయకుడు మద్ది ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్ గౌడ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవీంద్రమూర్తి, సోమయ్య, మాజీ ఎంపీటీసీ వేణు, మాజీ ఉపసర్పంచ్ కుమార్, నర్సింహారావు, రాహుల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన రన్ ఫర్ జీసెస్ ర్యాలీ

సంగారెడ్డి, మార్చి 30: రన్ ఫర్ జీసెస్ ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఆటపాటలతో ప్రారంభించి పాతిరెడ్డిపల్లి చౌరస్తా మీదుగా సీఎస్ఐ చర్చి వరకు నిర్వహించారు. వేడుకలను యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించి క్రైస్తవుల నమ్మకాన్ని నిలబెట్టారు. కార్యక్రమానిక డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ ఇన్నారెడ్డి క్రైస్తవ భక్తులకు దైవసందేశం అందించారు. కార్యక్రమంలో రూబీన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు సునీల్, నిర్మల్, సాల్మోహన్, వినయ్, ఫిలిప్, రాజు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు

కోహీర్, మార్చి 30: కోహీర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం ధనిక నీటి పొదుపు సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి పొదుపు వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వర్షపునీటిని ఎలా వినియోగించుకోవాలో వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటిని వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ముకుంద్ శిల్పి, సంస్థ ప్రతినిధులు పూర్ణచందర్‌రావు, చక్రధర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరాలు ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 30: ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు అంటువ్యాధుల నివారణ, ధూమపానం, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు, ఓటు హక్కు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఎమ్ఎన్ఆర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జగదీశ్వర్, వెంకటేశం, పద్మజ, శివదీప్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అమీన్‌పూర్ మార్చి 30: కుటుంబ సభ్యులు హింసించడంతో మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మున్సిపాలిటీ చెందిన నసీమాబేగానికి(29) ఎండీ.పాషాతో 2017లో వివాహం జరిగింది. కొంతకాలం బాగానే ఉన్నా, ఆ తర్వాత కుటుంబ సభ్యులతో గొడవలు ప్రారంభమయ్యాయి. నిత్యం మానసికంగా, శారీరకంగా హింసించడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినప్పటికీ వారు మారకపోవడంతో ఈనెల 29న నసీమా బేగం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి కరీంబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల శిక్షణ షెడ్యూల్‌ను సవరించాలి

కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఒక పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ ఒకేరోజు నిర్వహించే ఎన్నికల శిక్షణ షెడ్యూల్‌ను సవరించాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఒకేరోజు పాఠశాల ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాల నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడుతాయని పేర్కొన్నారు. ఒక పాఠశాలలోని ఉపాధ్యాయులకు సగంమందికి ఒక రోజు, మిగతా వారికి మరోరోజు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలింగ్ సిబ్బందిని కేటాయించాలన్నారు. పోలింగ్ అనంతరం కేంద్రాల నుంచి సిబ్బంది నివాసాలకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణీ ఉద్యోగులు, బాలింతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి, పోలింగ్ తేదీనాటికి పిల్లల పెండ్లిండ్లు ఉన్నవారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్ ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించని పరిశ్రమలపై చర్యలు

బొల్లారం, మార్చి 30: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని పరిశ్రమలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. శనివారం పారిశ్రామికవాడలో కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు ఆర్వో శ్రీధర్ బృందం ఆస్తి పన్ను వసూళ్ల ప్రక్రియ నిర్వహించారు. పన్ను చెల్లించని పరిశ్రమలకు ఇదివరకే నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించని పరిశ్రమలపై అధికారులు చర్యలకు దిగారు. పన్ను చెల్లించని కారణంగా పారిశ్రామికవాడలోని సుజనా స్టీల్ పరిశ్రమను సీజ్ చేశారు. పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆర్వో శ్రీధర్ పరిశ్రమ యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించాలి

హత్నూర, మార్చి 30: దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేస్తూ, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న బీజేపీని ఆదరించాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. శనివారం దౌల్తాబాద్, హత్నూర, చిలప్‌చెడ్ల బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికులుగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మురళీయాదవ్, వాల్దాస్ మల్లేశం, నాగప్రభు గౌడ్, మహేశ్, అశోక్, చంద్రశేఖర్, మల్లేశం పాల్గొన్నారు.

నీలం మధు అభ్యర్థిత్వంపై అసంతృప్తి

ఆర్సీపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్

రామచంద్రాపురం, మార్చి 30: మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్‌ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించినప్పటి నుంచి స్థానిక కాంగ్రెస్ క్యాడర్‌లో నైరాశ్యం కన్పిస్తున్నది